మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

- బిఆర్‌ఎస్‌లో ఉన్న దయ్యాలను తేల్చండి
- కెసిఆర్ నీ స్థాయి ఎంత?
- టిటిడి తరహాలో వైటిడి ఏర్పాటు
- గంధమల్ల రిజర్వాయర్

పూర్తి చేస్తాం : సిఎం రేవంత్

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు మూసీ నది కాలుష్యంతో ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు మూసీ ప్రక్షాళన చేస్తానంటే బిజెపి, బిఆర్‌ఎస్‌కు ఎందుకింత అక్కసు.. ఎవరు అడ్డు వచ్చినా ప్రక్షాళన చేసి తీరుతాం.. ఈ ప్రాంత ప్రజల కష్టాలు తీర్చుతాం" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం, తుర్కపల్లి మండలం తిరుమలగిరి గ్రామంలో గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణంతోపాటు సుమారు రూ.1051.45 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. తన జన్మదినం సందర్భంగా నవంబర్ 11న సందర్భంగా లక్ష్మీ నరసింహస్వామి పాదాల చెంత మూసీ వెంట పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నానని చెప్పారు. ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చి పనులు మొదలు పెట్టామని, కానీ మోకాళ్ల కట్టె పెట్టి అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీలో యమునా నది, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి గంగానది ప్రక్షాళన చేస్తే తప్పు లేదుగానీ తెలంగాణలో మూసీ నది కాలుష్యం నుంచి ప్రజలను కాపాడుకుంటామంటే తప్పేంటని ప్రశ్నించారు. ఆరు నూరైనా మూసీ నదిని ప్రక్షాళన చేసి గోదావరి నదీ జలాలతో నింపుతామని తెలిపారు. పదేండ్లలో గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులపై రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేస్తే.. ఎస్‌ఎల్‌బిసికి, డిండికి నిధులు ఎందుకు ఇవ్వలేదని? ఎందుకు పూర్తి చేయలేదని ? ప్రశ్నించారు.

బిఆర్‌ఎస్‌లో కెసిఆర్ చుట్టూ దయ్యాలు చేరాయని స్వయంగా ఆయన కుమార్తె కవిత ప్రకటించారని, అందువల్ల బిఆర్‌ఎస్‌లో ఉన్న దయ్యాలు ఎవరో తేల్చాలని అన్నారు. ఇకపై భారత రాష్ట్ర సమితి కాదని, దయ్యాల రాష్ట్ర సమితి (డిఆర్‌ఎస్) అని పేరు ప్రకటించారు. బిఆర్‌ఎస్ కార్యకర్తలను దెయ్యాలుగా అభివర్ణించాలని సూచించారు.

పీవీకే కమిషన్ ఎదుట హాజరు తప్పలే ..

"కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై కెసిఆర్‌కు నోటీసులు జారీ చేస్తే.. కాళేశ్వరం కమిషన్ కాదు కాంగ్రెస్ కమిషన్ అని అంటారా? దేశానికి ప్రధానిగా చేసిన పివి నరసింహారావుకే ఒక సందర్భంలో కమిషన్ ఎదుట హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. ప్రధాని స్థాయి నాయకుడే కమిషన్ ఎదుట హాజరయ్యారు. కేసీఆర్ నువ్వు ఎంత.. నీ స్థాయి ఎంత అని" సిఎం అన్నారు. ప్రజలు సహకరిస్తే తెలంగాణను 10 ఏళ్లలో వన్ ట్రిలియన్ ఎకానమీ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. తెలంగాణ ప్రజలు దేశ పునర్నిర్మాణంలో భాగస్వాములయ్యేలా నిలబెడతామని, జపాన్, సింగపూర్ సరసన రాష్ట్రాన్ని నిలుపుతామని అన్నారు. దేశంలో వందేండ్లలో ఎవరూ చేయని విధంగా మొదటిసారి కులగణన చేపట్టి రాష్ట్రంలో 56.36శాతం బలహీన వర్గాలు ఉన్నారని లెక్కలు తీశామన్నారు. విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు.

ఆలేరు నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ గంధమల్ల రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, అన్ని సామాజిక తరగతుల పిల్లలు ఒకే చోట చదువుకునే విధంగా 100 నియోజకవర్గాల్లో రూ.20వేల కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మిస్తున్నామని చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలో యాదగిరిగుట్ట టెంపుల్‌కు వైటీడీ (యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్)బోర్డు ఏర్పాటు చేస్తామని సిఎం ప్రకటించారు. తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మాదిరిగానే ఇక్కడ చేపట్టే ప్రభుత్వ వైద్య కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్తామని, దేశంలోనే గొప్ప యూనివర్సిటీగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని క్యాబినెట్‌లో చర్చించి.. ఒక కొలిక్కి తెచ్చామన్నారు. గత పదేండ్లలో ఏనాడైనా మొదటి తేదీన జీతాలు పడ్డాయా.. ఆనాడు జీతాలు చెల్లించలేనివారు ఈ రోజు మాట్లాడుతున్నారని విమర్శించారు.

సమావేశానికి అధ్యక్షత వహించిన ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏఎంఆర్‌పి కింద మిగిలిపోయిన 10 కిలోమీటర్ల ఉప కాలువ పనులకు నిధులు ఇచ్చి పూర్తి చేయాలని సీఎంను కోరారు. తుర్కపల్లి మండలానికి ఇండస్ట్రియల్ పార్కు మంజూరు చేయాలని, గుండాల కాల్వ పనులకు నిధులు మంజూరు చేయాలని, బొమ్మలరామారంలో రోడ్లు, డ్రయినేజీ సమస్యలు తీర్చాలని, మదర్ డెయిరీని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు ముఖ్యమంత్రి పట్టాలు పంపిణీ చేశారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు రూ.54 కోట్ల 70 లక్షల బ్యాంక్ లింకేజీ చెక్కులను అందజేశారు.

శంకుస్థాపనలు

రూ.574.56 కోట్లతో నిర్మించనున్న గంధమల్ల రిజర్వాయర్ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి, యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.183 కోట్లతో నూతన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో సిసి రోడ్లు, బీటీ రోడ్లు, స్ట్రాం వాటర్ డ్రయినేజీ పనులకు, రూ.7.50 కోట్లతో కొలనుపాకలో హెచ్‌ఎల్‌బి నిర్మాణ పనులకు, ఆరు కోట్లతో కల్వలలో చేపట్టే హెచ్‌ఎల్‌బి నిర్మాణానికి, మోటకొండూరు తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామంలో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం పనులకు, ఆలేరు నియోజకవర్గంలో బిటి రోడ్ల పనులకు, ఆలేరు మార్కెట్ యార్డులో 2500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దనసరి సీతక్క, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామెల్, ఎమ్మెల్సీలు శంకర్ నాయక్, తీన్మార్ మల్లన్న, శ్రీపాల్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, డెయిరీ కార్పొరేషన్ చైర్మెన్ గుత్తా అమిత్ రెడ్డి, పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిసిపి ఆకాన్ష్ యాదవ్ పాల్గొన్నారు.

లాసెట్‌కు 79.02 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ మేరకు లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లాసెట్‌లో భాగంగా మూడేళ్ల లా కోర్సుకు మొదటి విడతలో 20,719 మంది దరఖాస్తు చేయగా, 16,109 (77.75 శాతం) మంది, రెండో విడతకు 20,491 మంది దరఖాస్తు చేస్తే 16,009 (78.13 శాతం) మంది హాజరయ్యారని వివరించారు. మూడో విడతలో ఐదేళ్ల లా కోర్సు, ఎల్‌ఎల్‌ఎంకు 16,505 మంది దరఖాస్తు చేయగా, 13,491 (81.74 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. లాసెట్‌కు మొత్తం 57,715 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే 45,609 (79.02 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 5న లాసెట్ ప్రాథమిక కీని విడుదల చేస్తామని తెలిపారు. ఈనెల 14 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఈ పరీక్షను ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మెన్లు ఇటికాల పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్, ఓయూ సీనియర్ ప్రొఫెసర్ జిబి రెడ్డి, రిజిస్ట్రార్ నరేష్‌రెడ్డి, ఓఎస్‌డీ ఎస్ జితేందర్ కుమార్ నాయక్, ఓయూ లా కాలేజీ ప్రిన్సిపాల్ ఎన్ రామ్‌ప్రసాద్

తెలంగాణ నీటిహక్కుల కోసం రాజీలేనిపోరు

- బనకచర్లపై కేంద్రానికి ఫిర్యాదు
- అన్యాయం చేస్తే ఉపేక్షించం
- మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ

ఫొటో: మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సెక్రటేరియట్‌లో మీడియాతో శుక్రవారం ఆయన చిట్‌చాట్ చేశారు. బనకచర్లపై తెలంగాణకు అన్యాయం చేస్తే ఉపేక్షించబోమని అన్నారు. ఇప్పటికే కేంద్రానికి ఫిర్యాదు చేశామని చెప్పారు. అంతరాష్ట్ర జలవిధానాలు, జీఆర్ఎంబి, సిడబ్ల్యుసి కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రులు సిఆర్ పాటిల్, నిర్మలా సీతారామన్‌కు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ లేఖలు రాసినట్టు చెప్పారు. 'ఎపి నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదనీ, వస్తే అన్ని నిబంధనలు పరిశీలిస్తామని చెప్పారు..చట్టం ప్రకారం ముందుకెళ్తామని హామీ' ఇచ్చారు. ఎపి ఉల్లంఘనలను లేఖలో వివరించామని, చట్టవిరుద్ధంగా ఎపికి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదు.. తెలంగాణకు అన్యాయం జరిగితే.. ఎంతవరకైనా పోరాడుతాం, తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని, వెనక్కి తగ్గేదేలేదని వివరించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలి. కృష్ణాలో అన్యాయం జరుగుతుంటే పదేళ్లు బిఆర్‌ఎస్ సహకరించింది. ఉమ్మడి కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 724 టిఎంసిలు, ఎపి బిఆర్‌ఎస్ హయాంలో ఎపికి 1254 టిఎంసిలు తరలించారని గుర్తు చేశారు. కాళేశ్వరానికి వృధా ఖర్చు చేయకుంటే కృష్ణా ప్రాజెక్టులు అన్నీ పూర్తయ్యేవన్నారు. తుమ్మిడి హట్టి దగ్గర కాకుండా మేడిగడ్డ వద్ద కట్టడంతో రూ.68 వేల కోట్లు కాళేశ్వరం అదనపు ఖర్చు అయిందని చెప్పారు. ఎపికి 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు చాలని బిఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పలేదా? కృష్ణా నీళ్లల్లో అప్పుడు మోసం చేసి ఇప్పుడు బిఆర్‌ఎస్ నాటకాలు ఆడుతున్నారని అని ఉత్తమ్ విమర్శించారు. తముచ్చుమర్రి ప్రాజెక్టు పనులను బిఆర్‌ఎస్ సర్కారు కనీసం అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్నారు. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు తెలంగాణకు మరణశాసనమని వ్యాఖ్యానించారు. ప్రతిరోజూ మూడు టిఎంసిలను తరలించుకుపోతుంటే కెసిఆర్ సర్కారు తోడ్పడిందని చెప్పారు. జగన్‌తో అలైబలై చేసుకుని, కృష్ణానీటి దోపిడికీ కేసీఆర్ సహకరించారని వివరించారు. ఎపి దోచుకునేందుకు కెసిఆర్ సహకరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కెసిఆర్, హరీష్‌రావు ఎపి కోసమే పనిచేశారని వివరించారు. రాయలసీమ ప్రాజెక్టు టెండర్లు పూర్తయ్యేవరకు తెలంగాణ కావాలనే ఆపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లలేదని గుర్తు చేశారు. జగన్-కెసిఆర్ రహస్య ఒప్పందంలో భాగంగానే తెలంగాణ అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లలేదని విమర్శించారు. బనకచర్లపై బీఆర్‌ఎస్ నేతలు పచ్చిఅబద్దాలు చెబుతున్నారని గుర్తు చేశారు. బిఆర్‌ఎస్ నేతలు గోబెల్స్ రావు అని పేరు మార్చుకుంటే సరిపోతుందన్నారు. గోబెల్స్ బతికి ఉంటే, వీళ్లను చూసి నన్ను మించి అబద్దాలు ప్రచారం చేస్తున్నారంటూ ఆశ్చర్యపోయేవారన్నారు.

రైతు మహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఎరువుల సరఫరాలో కేంద్రం కొరత

- ముందుగానే బఫర్ స్టాక్ పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.35 వేల కోట్లు జమ
- ఈ ఏడాదీ సాగుకు ముందే భరోసా అందజేస్తాం
- రైతు మహోత్సవంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి రావాల్సిన ఎరువుల సప్లయ్‌లో కొరత పెట్టినప్పటికీ.. రాష్ట్ర ప్రభుత్వం ఎరువులు, యూరియా ముందే బఫర్ స్టాక్ పెట్టుకున్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మార్కెట్‌యార్డులో శుక్రవారం జరిగిన రైతు మహోత్సవ కార్యక్రమానికి మంత్రి హాజరై మాట్లాడారు. రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలంటే మానవాళికి కావాల్సిన అన్ని పంటలు పండించాలన్నారు. రైతును బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం రైతు భరోసా కింద ఇప్పటికే రూ.35వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. ఈ ఏడాదికి సంబంధించి కూడా సాగుకు ముందే రైతు భరోసాను అందజేస్తామన్నారు. కాగా పంట సాగు విషయంలో రైతులు మెళకువలు పాటించాలన్నారు. మన తాతలు రెండు కిలోల యూరియా వాడితే మనం 150 కిలోల యూరియా వాడుతున్నామని తెలిపారు. ఇతర దేశాలు మన పంటలు కొనాలంటే వారు టెస్ట్ చేసినప్పుడు అది పనికి వచ్చేలా ఉండాలన్నారు. ప్రకృతి సిద్ధంగా సేంద్రీయ ఎరువులతో పండిస్తే.. ఆ పంటకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని చెప్పారు. వ్యవసాయ యూనివర్సిటీ వీసీ, ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, అనుభవం ఉన్న రైతుల ద్వారా మెళకువలు నేర్చుకోవాలన్నారు. మన భూమికి ఏ పంట అవసరం.. ఏ పంట వేస్తే ఆదాయం అధికంగా వస్తుందని చూసిన తర్వాతే పంటలు వేయాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు తెచ్చుకునే పరిస్థితి వచ్చిందని.. అలా కాకుండా ఇతర దేశాలకు కూడా కూరగాయలు ఎగుమతి చేసే స్థాయికి ఇక్కడి రైతులు ఎదగాలన్నారు. ఆయిల్ పామ్ సాగుతో ఆర్థిక వృద్ధి సాధించవచ్చని తెలిపారు. హుస్నాబాద్‌కు దగ్గరలోనే నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని వచ్చే నెలలో ప్రారంభిస్తామన్నారు. హార్టికల్చర్, అంతర పంటల ద్వారా ఆదాయం వస్తుందని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. నష్టం వస్తున్నా.. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సన్‌ఫ్లవర్, జొన్నలు, మక్కలు, పెసలు కొనుగోలు చేశామన్నారు. దీనిపై రాజకీయాలు మాట్లాడటం సరికాదన్నారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రాజకీయాలకతీతంగా రైతులను ఆత్మీయంగా దగ్గర పెట్టుకోవాలన్నారు. పాడి పరిశ్రమ, ఆవులు, గేదెలు, చేపలు వ్యవసాయ అనుబంధ రంగాలను రైతులు పెంచాలన్నారు. మునగ ద్వారా మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. కాగా అంతకుముందు హుస్నాబాద్ పట్టణం నుంచి ఎడ్ల బండిలో ఊరేగింపుగా రైతు మహోత్సవానికి మంత్రులు హాజరయ్యారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి.. పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవ రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ గోపి, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, అడిషనల్ కలెక్టర్ గరిమ అగర్వాల్, అబ్దుల్ హమీద్, సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

గతేడాది టాస్క్ ద్వారా 4,100 మందికి ఉద్యోగాలు

- మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత విద్యా సంవత్సరంలో తెలంగాణా అకాడెమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జి (టాస్క్) ద్వారా 4,100 మందికి ఉద్యోగాలు కల్పించినట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో కనీసం 6 వేల మందికి ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా నిరుద్యోగులకు ఆధునాతన సాంకేతిక శిక్షణ అందించి ప్లేస్‌మెంట్స్ కల్పించేలా భారీ లక్ష్యం నిర్దేశించుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి 'టాస్క్' చేపడుతున్న కార్యక్రమాలపై హైదరాబాద్‌లోని సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ నిరుద్యోగులకు, విద్యార్థులకు నైపుణ్యాలను అందించడంలో టాస్క్ గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలు పొందడంలో సాయం చేస్తోందని చెప్పారు. గతేడాది కాలంలో టాస్క్ సంస్థ రికార్డు స్థాయిలో 1,37,677 మంది విద్యార్థులు, 2,791 మంది ఫ్యాకల్టీ సభ్యులకు వివిధ సాంకేతిక, నైపుణ్య అంశాల్లో శిక్షణ అందించిందని వెల్లడించారు. "21 జిల్లాల్లోని 148 కళాశాలు, పలు కంపెనీల ప్రాంగాణాల్లో నిర్వహించిన జాబ్ మేళాల్లో 4,100 మంది ప్రతిభావంతులు ఉద్యోగాలు పొందడంలో టాస్క్ కీలక పాత్ర పోషించింది. వెరిస్క్ ఎనలైటిక్స్ అనే అమెరికన్ కంపెనీ హైదరాబాద్ క్యాంపస్ కోసం ఏడాదికి రూ.11 లక్షల ప్యాకేజీతో సాంకేతిక నిపుణులను ఎంపిక చేసుకుంది. ఉద్యోగాలు సాధించిన మొత్తం 4,100 మందిలో, కనీస వార్షిక ప్యాకేజి రూ.2.4 లక్షలు. హ్యుండాయ్ మోబిస్ సంస్థ టాస్క్ ద్వారా 42 మందికి శిక్షణ అందించి ఉద్యోగాల్లో నియమించుకుంది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ స్విట్జర్లాండ్ (యుబిఎస్) రూ.6 లక్షల వార్షిక ప్యాకేజితో 63 మందిని రిక్రూట్ చేసుకుంది. 1ఎం1బి (వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్) ఫౌండేషన్ తెలంగాణాలో ఏర్పాటు చేసిన గ్రీన్ స్కిల్స్ అకాడెమీ ద్వారా మేడ్చల్, సంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాల నుంచి 7,000 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు ఐక్యరాజ్య సమితి 2024 డిసెంబర్‌లో న్యూయార్క్‌లో నిర్వహించిన గ్లోబల్ సదస్సుకు హాజరయ్యారు. అంగ వైకల్యం ఉన్న యువతకు వివిధ నైపుణ్యాల్లో శిక్షణనిచ్చి ఉద్యోగాలు పొందేలా సాయపడేందుకు, ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు టాటా ట్రస్ట్‌తో టాస్క్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీని కింద మూడేళ్ల పాటు టాటా సంస్థ శిక్షణ కార్యక్రమాలు చేపడుతుంది. యనిమేషన్, గేమింగ్, విఎఫ్ఎక్స్, కామిక్స్‌లో యువతకు 3 ఏళ్ల పాటు శిక్షణ ఇచ్చేందుకు ట్వాగా అనే సంస్థతో కూడా టాస్క్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వచ్చే మూడేళ్లలో ఎక్స్ఆర్ మాంక్ అనే కంపెనీ ద్వారా 10 వేల మంది విద్యార్థులకు వర్చువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, మిక్స్‌డ్ రియాలిటీలో అత్యాధునిక శిక్షణ కోసం ఎంఓయూ చేసుకుంది.

కణతపై తుపాకీ పెట్టినా నిజమే చెప్తా

- కెసిఆర్, హరీష్‌రావు దగ్గరే కాళేశ్వరం సమాచారం
- ఈటలను క్రాస్‌ఎగ్జామిన్ చేసిన న్యాయ కమిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'నా కణతపై తుపాకీ పెట్టినా నిజమే చెప్తాను' అని మాజీ మంత్రి, బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిఆర్‌కెఆర్ భవన్‌లో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ ఆయన ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ ఈటెలను క్రాస్ ఎగ్జామిన్ చేసింది. అఫిడవిట్ తీసుకుంది. కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలపై ఆర్థిక శాఖ ప్రమేయం ఉందా? అని కమిషన్ చైర్మన్ జస్టిస్ పిసి ఘోష్ అడగ్గా దీనిపై ఆర్థిక శాఖకు ఏ మాత్రమూ సంబంధం లేదని ఈటల తెలిపారు. ఇది పూర్తిగా నీటిపారుదల శాఖకు సంబంధించిందని, తన కణతపై తుపాకీ పెట్టినా సరే.. నిజమే మాట్లాడతానని, తప్పుఒప్పులు ఎవరివో తెలంగాణ ప్రజలు తేలుస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రిపోర్టులూ బయటపెట్టాలని, కాళేశ్వరం అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని, ప్రాజెక్టు నష్టాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, కఠినంగా శిక్షించాలని కోరారు. విచారణ ముగిసిన అనంతరం మీడియాతో ఈటల మాట్లాడుతూ బిఆర్‌ఎస్ హయాంలో ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమాచారమంతా కెసిఆర్, హరీష్‌రావు దగ్గరే ఉందన్నారు. ఈ వ్యవహారంలో తన పాత్రేమీ లేదని, ప్రాజెక్టు రీడిజైనింగ్ కోసం కేబినెట్ సబ్ కమిటీని కెసిఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. దీనికి అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీష్‌రావు చైర్మన్‌గా ఉన్నారు. నీటి లభ్యత అంశాన్ని దృష్టిలో పెట్టుకుని మేడిగడ్డ వద్ద ఆనకట్టు నిర్మాణం చేపట్టారని, బ్యారేజీల నిర్మాణం సాంకేతిక నిపుణులకు సంబంధించిన అంశమని, ఆ నిర్మాణంపై రాజకీయ నాయకులకు ఏమీ తెలియదని చెప్పారు. రూ. 63 వేల కోట్లతో మొదట కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రతిపాదన చేశారని, తర్వాత అనేక కారణాలతో ప్రాజెక్టు వ్యయం రూ. 82 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. ఈ ప్రాజెక్టు తన మానస పుత్రిక అని కెసిఆర్ వందలసార్లు చెప్పారని గుర్తు చేశారు. ఏ పార్టీలో ఉన్నా, ఏ పదవిలో ఉన్నా నైతిక విలువలు పాటించానని వ్యాఖ్యానించారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

- ముస్లిం సోదరులకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ (ఈద్ ఉల్ అజ్) పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం అస్సలామ్, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రవక్తల అచంచలమైన దైవభక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. తమకు ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని చాటిచెపుతోందని సీఎం అభిప్రాయపడ్డారు.

చెదిరిన మస్క్- ట్రంప్ స్నేహం

కుప్పకూలిన టెస్లా షేర్లు

వాషింగ్టన్ : టెక్ బిలియనీర్ ఎలన్ మస్క్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య స్నేహ బంధం చెదిరింది. ట్రంప్ పేరు జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసు ఫైల్స్‌లో ఉందని మస్క్ ఆరోపించడంతో ఇద్దరి మధ్యల మాటల యుద్ధం వ్యక్తిగత విమర్శల వరకు వెళ్లింది. తనతో ఉన్న సంబంధాల కారణంగానే ట్రంప్ ఎన్నికల్లో గెలిచారని, కాంగ్రెస్‌లో రిపబ్లికన్‌లకు ఆధిక్యం లభించిందని మస్క్ ట్వీట్ చేశారు. మస్క్ తీరుపై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల కారణంగానే ఎలన్ మస్క్ కలత చెందారని ట్రంప్ పేర్కొన్నారు. మస్క్‌కు ప్రభుత్వం నుంచి అందుతున్న సబ్సిడీలను, కాంట్రాక్టులను కూడా రద్దు చేయాలని ప్రతిపాదించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ 2019లో బాలికలను లైంగికంగా వేధించిన కేసులో అరెస్ట్ అయ్యాడు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ట్రంప్ సహా పలువురు ప్రముఖుల పేర్లు ఉన్నాయి. ఎప్‌స్టీన్ ప్రయివేటు ద్వీపానికి తాను ఎప్పుడూ వెళ్లలేదని.. 2004లోనే అతనితో సంబంధాలు తెంచుకున్నానని ట్రంప్ పేర్కొన్నారు. ఇరువురి మధ్య మాటల యుద్ధంతో ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా షేర్లు కుప్పకూలాయి. గురువారం ట్రేడింగ్‌లో టెస్లా షేర్లు ఏకంగా 14శాతం లేదా 152 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.13 లక్షల కోట్లు) సంపద ఆవిరైంది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 1 ట్రిలియన్ మార్కును కోల్పోయి 916 బిలియన్ డాలర్లకు పడిపోయింది. టెస్లా సంపద ఒక్క రోజులోనే ఈ స్థాయిలో తరిగిపోవడం సంస్థ చరిత్రలోనే ఇదే తొలిసారి కావడం గమనార్హం.

ఇకపై ఫీచర్ ఫోన్లలోనూ ఫోన్‌పేతో చెల్లింపులు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ఇకపై ఫీచర్ ఫోన్ వినియోగదారులకు డిజిటల్ చెల్లింపు సేవలను అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది. దీని కోసం జిఎస్‌పే టెక్నాలజీ కన్వర్‌జేషనల్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్ గప్‌చుప్‌ను కొనుగోలు చేసినట్లు శుక్రవారం ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. రానున్న త్రైమాసికాల్లో భారత్‌లో కొత్త ఫీచర్ ఫోన్‌ల కోసం సొంత యుపిఐ మొబైల్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసిన యుపిఐ 123పే ఆధారంగా జిఎస్‌పే పనిచేస్తుంది. ఫీచర్ ఫోన్లు వినియోగించేవారికి యుపిఐ సేవలు అందించేందుకు ఇది సాయపడుతుందని ఫోన్‌పే సహ వ్యవస్థాపకుడు, సిఇఒ సమీర్ నిగమ్ తెలిపారు. దీంతో ఫీచర్ ఫోన్‌లు, స్మార్ట్‌ఫోన్‌ల మధ్య చెల్లింపులు చేయడం కూడా త్వరలో సాధ్యం కానుందన్నారు.

ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో 3 శాతం తగ్గుదల

న్యూఢిల్లీ : వాహన కొనుగోళ్లకు డిమాండ్ తగ్గింది. ఈ ఏడాది మే నెలలో ముఖ్యంగా ఎంట్రీ లెవల్ కార్ల అమ్మకాలు భారీగా తగ్గాయని డీలర్ల అసోసియేషన్ ఎఫ్‌ఎడిఎ వెల్లడించింది. దీంతో గడిచిన నెలలో రిటైల్ 3 శాతం తగ్గి 3,02,214 యూనిట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని పేర్కొంది. గతేడాది ఇదే నెలలో 3,11,908 యూనిట్ల విక్రయాలు జరిగాయి. కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లలో యుద్ధ సంబంధిత ఆందోళనలు, సరిహద్దు ఉద్రిక్తతలు పెరగడం వలన కొనుగోలుదారులు కొనుగోళ్లను ఆలస్యం చేసి ఉండొచ్చని ఆ వర్గాలు భావిస్తున్నాయి. గడిచిన మే నెలలో ద్విచక్ర వాహన రిటైల్ అమ్మకాలు 7 శాతం పెరిగి 16,52,637 యూనిట్లుగా చోటుచేసుకున్నాయి. వాణిజ్య వాహన రిటైల్ అమ్మకాలు 4 శాతం తగ్గి 75,615 యూనిట్లుగా నమోదయ్యాయి. త్రీ వీలర్ రిజిస్ట్రేషన్లు 6 శాతం పెరిగి 1,04,448 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి.

త్వరలో పబ్లిక్ ఇష్యూకు ఈక్విస్

ముంబయి : ఏరోస్పేస్, కన్జ్యూమర్ రంగాలకి ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ సేవలు అందించే ఈక్వస్ లిమిటెడ్ తమ ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపిఒ)కు సంబంధించి కాన్ఫిడెన్షియల్ ప్రాతిపదికన ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా 200 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.1700 కోట్లు) సమీకరించే యోచనలో ఉందని తెలుస్తోంది. ఆఫర్ ఫర్ సేల్ విధానంలో (ఒఎఫ్‌ఎస్) షేర్లను విక్రయించనుంది. ఈ ఇష్యూకు కోటక్ మహీంద్రా క్యాపిటల్, జెఎం ఫైనాన్షియల్, ఐఐఎఫ్‌ఎల్ క్యాపిటల్ సంస్థలు లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి.

మారుతి గ్రాండ్ విటారా 3 లక్షల యూనిట్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి (ఎంఎస్‌ఐఎల్) తన మిడ్ సైజ్ ఎస్‌యువిల్లో ఒక్కటైనా గ్రాండ్ విటారా అమ్మకాలు 3 లక్షల యూనిట్లకు చేరినట్లు తెలిపింది. ఈ మోడల్‌ను ఆవిష్కరించిన 32 నెలల్లో ఈ మైలురాయిని సాధించినట్లు పేర్కొంది. ప్రతీ రోజు సగటున 300 యూనిట్ల చొప్పున విక్రయాలు జరిగాయని వెల్లడించింది. దీని ధరల శ్రేణీ రూ.11.42 లక్షల నుంచి రూ.20.68 లక్షలుగా ఉంది.

మార్కెట్లలో వడ్డీ రేట్ల కోత ఉత్సాహం

- సెన్సెక్స్ 747 పాయింట్ల ర్యాలీ

ముంబయి : రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీ రేట్లను అరశాతం తగ్గించడంతో మార్కెట్లలో కొనుగోళ్ల ఉత్సాహం కనబడింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 746.95 పాయింట్లు లేదా 0.92 శాతం పెరిగి 82,189కి చేరింది. ఇంట్రాడేలో ఏకంగా 82,299 గరిష్టాన్ని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 252.15 పాయింట్లు లేదా 1.02 శాతం లాభపడి 25,003 వద్ద ముగిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల చొప్పున తగ్గించింది. మరో అర శాతం తగ్గించడంతో ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని నింపింది. సెన్సెక్స్ 30 సూచీలో భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా సూచీలు మాత్రమే నష్టపోగా.. బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఎటర్నల్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఇక నెలకు రెండుసార్లు క్యాబినెట్ : సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇక నుంచి ప్రతినెలా రెండుసార్లు మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 15 రోజులకోసారి మంత్రివర్గ సమావేశాలను నిర్వహిస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా మొదటి, మూడో శనివారం మంత్రివర్గ సమావేశాలు జరుగుతాయని వివరించారు. విధానపరమైన నిర్ణయాల విషయంలో ఆలస్యం లేకుండా వేగం పెంచాలనీ, అందుకే రెండు, మూడు నెలలకోసారి కాకుండా నెలకు రెండు సార్లు నిర్వహిస్తామని వివరించారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంత్రులతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు వీలుగా రెండు వారాలకోసారి మంత్రివర్గ సమావేశం ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు 17 సార్లు మంత్రివర్గ సమావేశాలు జరిగాయని తెలిపారు.

IN THE COURT OF THE Ist ADDL. JUNIOR CIVIL JUDGE ANANTHAPURAMU
O.S. No:40/2023

Between:
Talari Ramudu ...Plaintiff
And
1.Shaik Imtiyaz,
2.V.Mahesh Reddy ...Defendants

Notice to The Defendant No:1&2

D1:Shaik Imtiyaz, S/o S.Mahaboob, Muslim, R/o D.No.8-14-73/2, Meeralam Tank, 14th Ward, Rajendra Nagar, Hyderabad, Ranga Reddy District.
D2: V.Mahesh Reddy, S/o Late V.Eswara Reddy,.R/o D.No.1-7-244-1, Kompalli, Hyderabad.

పై నెంబరు కేసులో Defendants అయిన మీ హాజరు నిమిత్తము 17-06-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
N.R.K.Mohan, Advocate,
Ananthapuram. Cell: 9440787100.

త్వరలో భారత్‌లోకి ఒప్పో కె13ఎక్స్

హైదరాబాద్ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల బ్రాండ్ ఒప్పో త్వరలో భారత మార్కెట్లోకి ఒప్పో కె13ఎక్స్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. తన కె సిరీస్ ఫోన్లను విస్తరించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే ఒప్పో కె13 అమ్మకాల్లో విజయవంతం కావడంతో కె13ఎక్స్ 5జిని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. యువ వినియోగదారులే లక్ష్యంగా దీన్ని డిజైన్ చేసినట్లు వెల్లడించింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ చొరవ

- తెలంగాణ ఉద్యోగ జెఎసి కృతజ్ఞతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపినందుకు తెలంగాణ ఉద్యోగ జెఎసి కృతజ్ఞతలు తెలిపింది. మిగిలిన సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని కోరింది. ఈ మేరకు ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కె కేశవరావు, సిఎస్ రామకృష్ణారావు, అధికారుల కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్, సభ్యులు లోకేశ్ కుమార్, కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జిఎడి ముఖ్యకార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కాకు ధన్యవాదాలు తెలిపారు. పలు దఫాలుగా సిఎం, డిప్యూటీ సిఎం, అధికారుల కమిటీని కలిసి 57 డిమాండ్లను పరిష్కరించాలని కోరామని తెలిపారు. దీంతో మంత్రివర్గ సమావేశంలో రెండు డిఎలు మంజూరు, పెండింగ్ బిల్లుల కోసం నెలకు రూ.700 కోట్లు చెల్లించడం, ఆరోగ్య కార్డుల కోసం హెల్త్ కేర్ ట్రస్టును ఏర్పాటు చేయడం, సకాలంలో పదోన్నతులు ఇవ్వడానికి నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. సచివాలయంలో 12.5 శాతం హెచ్‌ఒడి కోటాను పునరుద్ధరించడం, స్టేట్ లెవెల్ మెడికల్ ఇన్వాలిడేషన్ కమిటీని ఏర్పాటు చేయడం, నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు, ఉద్యోగుల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, సంఘాలకు గుర్తింపు ఇవ్వడం, 317 జిఓలో ఇంకా కేటగిరీలను చేర్చడం, ఎన్నికల్లో జరిగిన బదిలీలను పూర్వ స్థానాలకు బదిలీ చేయడంతోపాటు 45 ఆర్థికేతర సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకుందని తెలిపారు. పరిష్కరించాల్సిన సమస్యలు ఇంకా ఉన్నాయని, త్వరలోనే వాటిని పరిష్కరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇళ్లు

- పేదలు ఉన్న చోటే జీ ప్లస్ త్రి పద్ధతిలో ఇళ్ల నిర్మాణం
- గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేల ఇళ్లు
- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఇక నుంచి పట్టణాల్లోనూ చేపడతామని గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణాల్లోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండేందుకు ఇష్టపడుతున్నారని తెలిపారు. హైదరాబాద్‌కు దూరంగా ఇళ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇళ్లు తీసుకునేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42 వేల ఇండ్లను నిర్మించామని, సుమారు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారని తెలిపారు. ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన చేయడం ద్వారా కేవలం 13 వేలమంది మాత్రమే అక్కడ నివాసం ఉంటున్నట్టు తేల్చిందని చెప్పారు. ఈ క్రమంలో పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా హైదరాబాద్ నగరంలోని మురికి వాడల్లో పేదలు ఉన్నచోటే జీ ప్లస్ 3 పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలివిడతలో హైదరాబాద్‌లో 16 మురికివాడలను గుర్తించామని, అలాగే వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, కరీంనగర్ తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మున్ననూరు నాలుగు ఐటిడిఎ పరిధిలో గల చెంచు, కొలం, తోటి, కొండరెడ్లకు 13,266 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని వివరించారు. రాష్ట్రంలోని 16 ఎస్‌టి నియోజకవర్గాలకు ఇప్పటికే 8,750 ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇంతవరకు 22,016 ఇందిరమ్మ ఇళు మంజూరు చేసినట్టు తెలిపారు. వీటికి వెంటనే లబ్దిదారులను గుర్తించి ఇండ్ల నిర్మాణ ప్రక్రియను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణంలో మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా పేదల ఇంటి కోసం ఐదు లక్షల రూపాయిలు ఖర్చు చేయ లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యమనీ, దీనికి అనుగుణంగా అధికార యంత్రాంగం పని చేయాలని మంత్రి సూచించారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫెయిలవ్వడంతో మానసికంగా కుంగిపోయిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాలానగర్ సిఐ నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పలాని చంద్రప్రియ (16) అల్విన్ కాలనీలోని విజేత జూనియర్ కళాశాలలో ఎంఇసి చదివారు. ఆమె తండ్రి పలాని చక్రపాణి ప్రయివేటు ఉద్యోగి. వారి కుటుంబం పద్మానగర్ ఫేజ్ 1లో నివసిస్తోంది. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్ష మొదటి సంవత్సర ఫలితాల్లో చంద్రప్రియ నాలుగు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె సోదరుడు ఇంటికి వచ్చి చూసి ఇరుగు పొరుగు వారి సహాయంతో ఆమెను కిందికి దించగా అప్పటికే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు సెక్షన్ 194 ప్రకారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ప్రేమ జంటపై దాడి దుర్మార్గం : కెవిపిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్ర పోలీస్ స్టేషన్‌లో పోలీసుల సమక్షంలోనే అగ్రకుల ఆధిపత్యంతో ప్రేమ జంటపై దాడి చేయటం దుర్మార్గమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి పాల్పడిన ఆ దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రాజేంద్రనగర్‌లో జంట హత్యల కలకలం

- వృద్ధ దంపతులను గొంతు కోసి చంపిన దుండగులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని జనచైతన్య ఫేజ్-2లో జంట హత్యల ఘటన కలకలం లేపింది. వృద్ధ దంపతులను దారుణంగా గొంతు కోసి చంపిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ అబ్దుల్లా (70), రిజ్వానా (65) భార్యా భర్తలు రాజేంద్రనగర్‌లో నివాసముంటున్నారు. షేక్ అబ్దుల్లా రిటైర్ ఎస్‌బీఐ బ్యాంక్ ఉద్యోగి. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు అమెరికాలో, కూతుళ్లు ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. అయితే ఇటీవల షేక్ అబ్దుల్లా రాజేంద్రనగర్‌లో జనచైతన్య ఫేజ్-2లో నూతనంగా ఐదంతస్తుల భవనాన్ని నిర్మించారు. కింద నాలుగు అంతస్తులు ఇతరులకు అద్దెకిచ్చారు.. ఐదో అంతస్తులో షేక్ అబ్దుల్లా దంపతులు ఉంటున్నారు. గురువారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు ఇంటి ఓనర్‌కి ఫిజియోథెరపీ చేయాలని అపార్ట్‌మెంట్ కింద వాచ్‌మెన్‌ని పైకి వెళ్లడానికి పర్మిషన్ అడిగారు. వాచ్‌మెన్ షేక్ అబ్దుల్లాకు ఫోన్ చేసి ఇద్దరు వ్యక్తులు ఫిజియోథెరపీ చేయడానికి వచ్చారు.. పైకి పంపాలా అని అడిగారు. అతను పైకి పంపు అని చెప్పడంతో వాచ్‌మెన్ వారిద్దరిని పైకి పంపించారు. ఇందులో ఒకరు బుర్కా ధరించగా.. మరొకరు టోపీ మాస్క్ పెట్టుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం అయినా ఇంటి ఓనర్ కిందకి రాకపోవడంతో వాచ్‌మెన్ ఐదవ అంతస్తులోకి వెళ్లి చూడగా.. దంపతులు ఇద్దరు రక్తపు మడుగులో ఉన్నారు. వాచ్‌మెన్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలను సేకరించారు. దుండగులు డబ్బు కోసమే వారిద్దరిని హత్య చేశారా?.. మరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అని పోలీసులు విచారిస్తున్నారు. అదే విధంగా వాచ్‌మెన్ దంపతులనూ పోలీసులు ప్రశ్నించారు. దుండగులు వచ్చిన బైక్ నెంబర్, సిసి కెమెరాలు ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విదేశాల్లో ఉన్న దంపతుల కుమారులు, కూతుళ్లకు సమాచారం అందించారు.

ఉద్యోగులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ సర్కారు

- డిఎలు ఉద్యోగుల హక్కు : మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో: నమ్మిన ఉద్యోగులను కాంగ్రెస్ సర్కారు నట్టేట ముంచుతోందని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ నేత వి శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా నాన్చే ధోరణి ప్రదర్శించారని విమర్శించారు. ఐదు పెండింగ్‌లో ఉంటే ఒక్కదానితోనే సరిపెట్టి ఇంకోటి ఆరు నెలల తర్వాత ఇస్తామనటం మోసం చేయడమేనని తెలిపారు. వెంటనే రెండు డిఎలను చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్ మెంట్ బెనిఫిట్స్ పై కూడా ప్రభుత్వం మానవత్వం లేకుండా వ్యవహరించిందని పేర్కొన్నారు. నెలకు ఐదు వందల కోట్ల రూపాయల రిటైర్ మెంట్ బెనిఫిట్స్ కింద కేటాయిస్తామని మాట తప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు ఏడు వందల కోట్లు అంటున్నారని, ఉద్యోగులు ఎలా నమ్మాలి? అని ప్రశ్నించారు. వెంటనే రిటైర్ మెంట్ బెనిఫిట్స్ మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం తీసుకొస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. ప్రజలకు, ఉద్యోగులకు విబేధాలు సృష్టించే కుట్ర మంచిది కాదని హితవు పలికారు. ఉద్యోగులు లేకుండా ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవనే విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రహించాలని, ఆదాయవనరులు పెంచుకుని ఉద్యోగుల సంక్షేమం చూడాలని సూచించారు. ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు.

70 అడుగుల నాలా 15 అడుగులకు పరిమితం

- ప్యాట్నీసెంటర్‌లో ఆక్రమణల తొలగింపు
- ఐదు కాలనీలకు ఊరట

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో కబ్జాదారులు పార్కులను, చెరువులను, నాలాలను సైతం వదలడం లేదు. మురుగు నీరు వెళ్తున్నా కబ్జాచేసి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కట్టేస్తున్నారు. స్థానికుల ఫిర్యాదులతో హైడ్రా అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, పార్కులు, చెరువులు, ప్రభుత్వస్థలాలను రక్షిస్తోంది. ఈ క్రమంలో సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లో నాలాపై నిర్మించిన వాణిజ్య కట్టడాలను హైడ్రా తొలగించింది. 70 అడుగుల విస్తీర్ణంలో ఉండాల్సిన నాలా కబ్జాలతో 15 నుంచి 18 అడుగులకు పరిమితమైంది. ప్యాట్నీ నాలా ఆక్రమణకు గురికావడంతో పైగా కాలనీ, ప్యాట్నీ కాంపౌండ్, పాట్నీ కాలనీ, విమాననగర్, బీహెచ్ఈఎల్ కాలనీతోపాటు ఇందిరమ్మ నగర్ నీట మునుగుతున్నట్టు హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. గతంలో కంటోన్మెంట్ అధికారులకు కూడా ముంపు ప్రాంతాల వారు ఫిర్యాదు చేశారు. గురువారం కంటోన్మెంట్ సిఇఒ మధుకర్ నాయక్, జిహెచ్‌ఎంసి, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. నాలా ఆక్రమణలతో వేలాది నివాసాలు నీట మునిగిన పాత చిత్రాలను సెల్‌ఫోన్లలో స్థానికులు కమిషనర్‌కు చూపించారు. అన్ని కోణాల్లో పరిశీలించిన కమిషనర్ ఆక్రమణలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్‌లో ఆక్రమణలకు గురి కాకుండా వెంటనే హద్దులు నిర్ణయించి నాలాకు ఇరువైపులా ప్రహరీలు నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయమే నాలా ఆక్రమణల కూల్చివేతలు ప్రారంభించారు.

ఊపిరి పీల్చుకుంటున్న ఐదు కాలనీల వాసులు

నాలాపై అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు తొలగించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. నాలా ఆక్రమణలు జరిగితే కూల్చివేయాలన్న హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులు అమలవుతున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. కోర్టు కేసులున్నాయంటూ కాలయాపన లేకుండా హైడ్రా చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. 20 నుంచి 30 ఏళ్లుగా నీట మునుగుతున్న కాలనీల ఇబ్బందులు తొలగుతున్నాయంటూ హర్షం వ్యక్తం చేశారు. దాదాపు 30 వేల కుటుంబాలకు ఊరటనిచ్చారని హైడ్రాకు అభినందనలు తెలిపారు. హస్మత్‌పేట చెరువు వరద నీటిని తెచ్చే హస్మత్‌పేట నాలా, మహేంద్ర హిల్స్‌పై భాగం నుంచి వరద నీటిని తెచ్చే పికెట్‌నాలా 23 కిలోమీటర్ల మేర ప్రయాణించి ప్యాట్నీ పరిసరాల్లో కలుస్తుంది. అక్కడ కొందరు కబ్జా చేయడంతో 15 నుంచి 18 అడుగులకు పరిమితం అయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా చర్యలతో ఉపశమనం కలిగిందన్నారు.

గోదావరి జలాలను తరలిస్తుంటే.. ఆపే సత్తా లేదా..?

- అబద్ధాల్లో సిఎంను మించిన ఉత్తమ్ : హరీశ్‌రావు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణ నుంచి 400 టిఎంసిల గోదావరి జలాలను ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తుంటే ప్రభుత్వం గుడ్లప్పగించుకుని చూస్తుందా? వాటిని ఆపే సత్తా రాష్ట్ర ప్రభుత్వానికి లేదా?" అని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ప్రశ్నించారు. దీనిపై సుప్రీం కోర్టుకు ఖవెళ్లాలన్న సోయి కూడా ఈ ప్రభుత్వానికి లేదని, కేంద్ర మంత్రులను కలవరని, నీతి ఆయోగ్‌లో సిఎం మాట్లాడడని, ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీని ఈ సర్కార్ అడ్డుకోకపోగా.. చంద్రబాబు అడుగులకు మడుగులొత్తుతుందని విమర్శించారు. సిద్ధిపేట జిల్లా దుబ్బాక పట్టణ కేంద్రంలోని కెపిఆర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్‌తో కలిసి హరీశ్‌రావు మాట్లాడారు. గంధమల్ల ప్రాజెక్టు కాళేశ్వరంలో అంతర్భాగమని, కాళేశ్వరం కూలితే గంధమల్లకు గోదారిజలాలు ఎట్లా వస్తాయని ప్రశ్నించారు. అపెక్స్ కమిటీ, అంతర్రాష్ట్ర అనుమతి, గోదావరి ట్రిబ్యునల్ అనుమతి లేకుండా ప్రాజెక్టు కడుతుంటే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబును ఎదిరించే దమ్ము, సుప్రీంకోర్టుకు వెళ్లే సత్తా రాష్ట్ర సర్కార్‌కు లేదని అన్నారు. రాష్ట్ర చరిత్రలోనే తాత్కాలిక కేటాయింపుల ప్రకారం 65 టిఎంసిలు తక్కువ వాడిన మొట్టమొదటి చేతగాని ప్రభుత్వం రేవంత్ రెడ్డిదేనని, ఆరున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వకపోవడం వల్ల పంటలన్నీ ఎండిపోయాయన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేబినెట్‌లో మాట్లాడేందుకు సమయం దొరకలేదా? కేవలం వారి కమీషన్లు, పర్సెంటేజీలు, హై కమాండ్‌కు పంపే మూటల గురించే ఐదు గంటల సమయాన్ని వెచ్చించారని ఆరోపించారు. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే సుప్రీం కోర్టుకు బిఆర్‌ఎస్ వెళ్తుందన్న మాటకి కట్టుబడి ఉంటామని తెలిపారు. బనకచర్లతో తెలంగాణ రాష్ట్రం గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని, ఆ పనుల్ని బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిలిపివేస్తే, కాంగ్రెస్ సర్కార్ వచ్చాక మొదలుపెట్టిందన్నారు. తక్షణమే ఆ పనులను ఆపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇంతగా అన్యాయం జరుగుతుంటే ఇక్కడి కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు ఎందుకు మాట్లాడటం లేదో సమాధానం చెప్పాలన్నారు.

ప్రజలను నిరాశపరిచేలా కేబినెట్ నిర్ణయాలు

ఉద్యోగులను, రాష్ట్ర ప్రజలను నిరాశపరిచేలా కేబినెట్ నిర్ణయాలు ఉన్నాయని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఒపిఎస్‌ను అమలు చేసి పెండింగ్ డిఎలను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఐదు డిఎలు పెండింగ్‌లో ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, ఉద్యోగులను రాచి రంపాన పెడుతూ వారిని నిట్టనిలువునా ముంచుతున్నారన్నారు. రేవంత్ సర్కార్ తక్షణమే మూడు డిఎలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కార్యదర్శులను ఇబ్బంది పెడుతుందని, పంచాయతీ నిర్వాహణ భారమై అప్పుల పాలయ్యారని, తెలంగాణలో అప్పు లేని పంచాయతీ సెక్రటరీ లేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు, పురుగుమందుల విక్రయం

- ముఠా సభ్యుల అరెస్ట్
- 166 కిలోల నకిలీ విత్తనాలు, 800 లీటర్ల గడ్డిమందు స్వాధీనం
- వరంగల్ సిపి సన్‌ప్రీత్‌సింగ్

నకిలీ విత్తనాలతో సిపి సన్‌రపీత్‌సింగ్ పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగుమందులను విక్రయిస్తున్న ముఠాలను వరంగల్ పోలీసు కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్, పోలీసులు అరెస్టు చేశారు. వరంగల్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి సన్‌ప్రీత్‌సింగ్ వివరాలు వెల్లడించారు. పోలీసులకు అందిన పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్, పరకాల పోలీసులు, వ్యవసాయాధికారులు సంయుక్తంగా కలిసి ప్రధాన నిందితుడు పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన మాచబోయిన తిరుపతి ఇంటిపై దాడి చేసి నకిలీ, కాలంతీరిన పురుగుమందులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని విచారించగా, ఆయనిచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లోని మెహదీపట్నంలో నకిలీ పురుగుమందులు తయారు చేస్తున్న గోదాముపై దాడి చేసిన పోలీసులు.. సుమారు రూ.57.44 లక్షలు విలువ చేసే నకిలీ, కాలం తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకొని జయదీప్ గౌతమ్, ఆదిత్య, కుమారస్వామిని అరెస్ట్ చేశారు.

గీసుగొండ పోలీసు స్టేషన్ పరిధిలో ఎల్కుర్తి హవేలి ప్రాంతంలో బీరెడ్డి మర్రెడ్డి ఇంటిపై దాడి చేసి ఒక కిలో నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆయన ఇచ్చిన సమాచారంతో సంగారెడ్డి జిల్లా చింతలచెరువు గ్రామానికి చెందిన తానుగుండ్ల సందీప్‌రెడ్డి, తానుగుండ్ల విజయ్‌జోసెఫ్ రెడ్డి ఇళ్లపై దాడులు చేసి రూ.6.18 లక్షల విలువైన 166 కిలోల నకిలీ విత్తనాలతోపాటు ఎనిమిది వందల లీటర్ల గడ్డిమందును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రెండు ముఠాలకు చెందిన ఏడుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.63.62 లక్షల విలువైన 166 కిలోల నకిలీ విత్తనాలు, కాలం తీరిన 800 లీటర్ల గడ్డిమందును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బీటీ- 3 పేరిట లూజుగా ఈ విత్తనాలను అమ్ముతున్నారు. నకిలీ పురుగుమందుల తయారీకి అవసరమైన సామగ్రితోపాటు 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు సిపి తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన టాస్క్‌ఫోర్స్ ఎసిపి మధుసూదన్, పరకాల, మామునూరు ఎసిపిలు వెంకటేశ్, సతీష్‌బాబు, సిఐలు బాబులాల్, సార్ల రాజు, రంజిత్, ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బందిని సిపి అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్ కుమార్, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- బిజెపి ఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిజెపి ఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పది రకాల పంటలకు బోనస్ చెల్లించి రైతులకు మేలు చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. క్యాబినెట్‌లో ప్రజా సమస్యలపై చర్చించకుండా ప్రజల్ని రేవంత్ సర్కారు వంచించిందన్నారు. నిరుద్యోగులకు, మహిళలకి ఈ ప్రభుత్వం 63 వేల కోట్లు బకాయి పడ్డదని వివరించారు. ఓటమి భయంతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదని విమర్శించారు. ఇది కమీషన్ల కోసం ఆరాటపడే సర్కారు అని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ఎండమావి మాదిరిగా ఆశ పెట్టి ఇపుడు మోసం చేస్తోందని విమర్శించారు. డిమాండ్ చేసిన అంశాల్లో సగం కూడా నెరవేర్చకుండా రెండు డిఎలు ఇస్తామంటూ ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిందని విమర్శించారు. ఈ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు రూ.9,120 కోట్లను ఈ నెలాఖరులోగా విడుదల చేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి సర్కారు రోజుకు రూ.320 కోట్లు, గంటకు రూ.13కోట్ల చొప్పున అప్పు చేస్తూ పోతున్నదని విమర్శించారు. మాజీ సర్పంచుల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ అరెస్టు కాకుండా కాపాడుతున్నది సిఎం రేవంత్‌రెడ్డినే అని, వారిద్దరి మధ్య డూప్ ఫైటింగ్ నడుస్తోందని విమర్శించారు. విద్యుత్ ఒప్పందాలపై జస్టిస్ మదన్ లోకూర్ కమిషన్ రిపోర్టును ఎందుకు బయటపెట్టడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న 17 మందిపై క్రిమినల్ చర్యలు, మరో 33 మందిపై శాఖాపర చర్యలు తీసుకోవాలని, ఏడుగురికి జరిమానాలు విధించాలని విజిలెన్స్ కమిషన్ రిపోర్టు సూచించినా ఎందుకు పట్టించుకోవట్లేదనినిలదీశారు. కాంగ్రెస్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం, మిషన్ భగీరథ, ధరణి పోర్టల్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, ఈ-కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ సర్కారు అక్రమాలు, అవినీతితో రేవంత్ ప్రభుత్వం పోటీ పడుతోందని ఆరోపించారు.

చేప ప్రసాదం ఉబ్బసానికి మందే కాదు

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జెవివి రాష్ట్ర నాయకులు

- ప్రభుత్వం అశాస్త్రీయ విధానాలను ప్రోత్సహించటం మానుకోవాలి
- జెవివి సీనియర్ నాయకులు ప్రొఫెసర్ రామచంద్రయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

చేప ప్రసాదం ఉబ్బసానికి మందే కాదని జనవిజ్ఞాన వేదిక (జెవివి) సీనియర్ నాయకులు ప్రొఫెసర్ రామచంద్రయ్య చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జెవివి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కార్యదర్శి రాజా అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ఆస్తమా ఒక బాధాకరమైన వ్యాధని చెప్పారు. దాన్ని నయం చేసే పేరుతో చేప మందును వేలం వెర్రిగా ప్రచారం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో ప్రభుత్వం పాత్ర కూడా ఉందన్నారు. వాస్తవంగా రాజ్యాంగపట్ల గౌరవమున్న ఏ సర్కారైనా..అశాస్త్రీయ విధానాలను ప్రోత్సహించదని వివరించారు. చేప ప్రసాదంలో ఉబ్బసాన్ని తగ్గించే మందు ఏదీ లేదని ప్రయోగాల్లో తేలిందని గుర్తు చేశారు. మాంసాహారులకు చేపలతో ఉబ్బసం తగ్గితే..శాఖాహారులకు బెల్లంతో ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. గారడీ విధానాలను ప్రోత్సహించడం ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. మూఢనమ్మకాలకు ఊతమిచ్చేటట్టుగా సర్కారు చర్యలు ఉండకూడదన్నారు. శాస్త్రీయ విధానాలను రూపొందించి పాటింపచేయాలని సూచించారు. ఆస్తమా వ్యాధి నివారణకు, చికత్సకు ఉన్న ఆధునిక వైద్య విధానాన్ని ప్రభుత్వమే ప్రచారం చేయాలని డిమాండ్ చేశారు. ఆ వ్యాధిని తగ్గించే మందులను, ఇన్‌మెలర్స్‌ను ఉచితంగా పేదలకు అందించాలన్నారు. రాజా మాట్లాడుతూ ప్రతి ఆయాసం ఆస్తమా కాదన్నారు. ఆయాసం, దగ్గులకు అనేక కారణాలుంటాయని చెప్పారు. వాటిని తెలుసుకుని ఆధునిక చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రాన్ని జేవీవీ రాష్ట్ర నాయకులు లింగస్వామి, పి రజిని, విద్యాసాగర్‌తో కలిసి అవిష్కరించారు.

పార్టీ, ప్రభుత్వానికి మధ్య బంధం బలపడాలి

- సోషల్ మీడియాపై క్యాడర్‌కు కనీస అవగాహన లేదు
- దాన్ని ఉపయోగించడంలోనూ బలహీనం
- టిపిసిసి ప్రకటన ఆలస్యంపై కార్యకర్తల్లో అసంతృప్తి
- సిఎం రేవంత్‌రెడ్డితో మీనాక్షి నటరాజన్ భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత అంశాలపై చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. శుక్రవారం హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లోని సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, కేబినెట్ విస్తరణ, టిపిసిసి కమిటీల నియామకంపై చర్చలు జరిపినట్టు సమాచారం. ఈ సందర్భంగా పార్టీ, ప్రభుత్వానికి మధ్య బంధం ఏ విధంగా ఉందనే విషయంపై చర్చించినట్టు తెలిసింది. పార్టీ, ప్రభుత్వం జోడెద్దుల్లా ముందుకు పోయేందుకు కార్యచరణ రూపొందించాల్సిన అవసరంపై సమాలోచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై బిఆర్‌ఎస్, బిజెపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడంలో పార్టీ చాలా బలహీనంగా ఉందని గుర్తించారు. ముఖ్యంగా సోషల్ మీడియాను ఉపయోగించడంలో చాలా బలహీనంగా ఉన్నారనే విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. కొంత మంది నాయకులు, కార్యకర్తలకు సోషల్ మీడియాపై కనీస అవగాహన కూడా లేదని విషయాన్ని తేల్చారు. గత 10 రోజులుగా పార్టీ నేతలతో మీనాక్షి నటరాజన్ వరుస సమీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే పార్టీ నాయకులు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌పై సీఎంతో మీనాక్షి చర్చించారు. వారు చెప్పిన సమస్యలు, అభిప్రాయాలను ముఖ్యమంత్రికి వివరించారు. పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి...అలాగే అసెంబ్లీకి సంబంధించి నేతలతో ఉమ్మడి జిల్లాలకు కొంతమంది పర్యవేక్షకులను నియమించారు. వారందరితో వరుసగా పది రోజులపాటు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ విషయాలన్నీ రేవంత్ రెడ్డికి ఆమె వివరించారు. చాలా మంది నేతలు జిల్లాలు, నియోజకవర్గాల్లో ఒకరిపై మరొకరు ఫిర్యాదులు చేసుకున్నారు. దాంతో పాటు ఆధిపత్యపోరుకు సంబంధించి ఫిర్యాదులు వచ్చినట్టు వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి వివరాలు తెలియవనీ, వాటిపై వారికి అవగాహన లేకపోవడంతో జనాలకు వివరించలేకపోతున్నారని తేల్చారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలను అన్వేషించాలని కోరారు. అలాగే కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని దీనికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. వీటన్నింటికి సంబంధించిన విషయాలను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.